# ముగిసిన ఎన్నికల ప్రక్రియ



కలెక్టరేట్, డిసెంబర్ 5: యాభై అయిదు రోజులుగా రాష్ట్రాన్ని వేడెక్కించిన శాసనసభ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఇన్ని రోజులుగా అనుకూల, వ్యతిరేక ప్రచారాలతో ప్రజల ముంగిట గింగిరాలైన సామాజిక మాధ్యమాలు ఒక్కసారిగా సైలెంటయ్యాయి. నాయకులకు అనుకూలంగా, ప్రత్యర్థి వర్గాలకు వ్యతిరేకంగా బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్‌కాల్స్‌తో అనునిత్యం బెంబేలెత్తిపోయిన సెల్‌ఫోన్ వినియోగదారుల మోముల్లో రెండురోజుల నుంచి ప్రశాంతత కనిపిస్తోంది. అక్టోబర్ నెలలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి మొదలైన సోషల్‌మీడియా ప్రచారం, మంగళవారం సాయంత్రం ముఖ్యమంత్రి పేరు ఖరారయ్యే వరకు కొనసాగింది. పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు నిరాటంకంగా క్షణంతీరిక లేకుండా సామాజిక మాధ్యమాలు పనిచేసి, ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రచార భేరి మోగించాయి. జిల్లాలోని పలు పార్టీలు, స్వతంత్రులు కూడా కొంతమందిని ఇన్‌చార్జిలుగా నియమించుకుని, వారికి అనుకూలంగా పబ్లిసిటీ చేసుకున్నాయి. ఎన్నికల్లో గెలిస్తే ప్రజలకు చేయబోయే పనుల నుంచి మొదలు, పార్టీ నాయకులు, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ప్రచార వివరాలు, వ్యక్తిగత అంశాలపై కూడా సోషల్ మీడియా ద్వారా మోతమోగించారు. ప్రధానంగా వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌ల ద్వారా అప్పటికప్పుడే అప్‌లోడ్ చేస్తూ, అభ్యర్థుల అనుచరులు పోటీపడ్డారు. తమ పార్టీల ముఖ్య నాయకులు, స్టార్ క్యాంపెయినర్ల ఉపన్యాసాలు, ఎదుటివారిపై చేసే విమర్శలను ఫోకస్ చేస్తూ, తమ వాట్సప్‌లలో డీపీలుగా పెట్టుకోవడం, ఫేస్‌బుక్, వాట్సప్ గ్రూపుల్లో లైవ్‌గా ప్రసారం చేస్తూ పోటీపడ్డ వారంతా స్తబ్దంగా మారారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే కామెంట్లతో పలుచోట్ల వివాదాలు నెలకొనడంతో పాటు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అనేక సందర్భాల్లో తమ సొంత కవిత్వంతో ప్రజల్లో విసుగుతెప్పించే విధంగా వ్యవహరించి, ఎన్నికల సంఘం ఫిర్యాదు వరకు కూడా వెళ్లాయి. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడ్డ సాయంత్రం నుంచి కొంతమేర తగ్గినా, గెలుపొందిన అభ్యర్థులకు అనుకూలంగా పోస్టులు పెడుతూ, ఓటమి పాలైన వారిపై వ్యంగ్యాస్త్రాలు కూడా సామాజిక మాధ్యమాలు విసిరాయి. ముఖ్యమంత్రి ఎంపికపై కూడా భిన్నాభిప్రాయాలతో కామెంట్లు పెడుతూ, ఉత్కంఠను రేకెత్తించాయి. ఆ ప్రక్రియ కూడా పూర్తి కావడంతో మంగళవారం సాయంత్రం నుంచి సోషల్ మీడియాలో నిశబ్ద వాతావరణం ఏర్పడింది. 'హమ్మయ్య'.. అంటూ చరవాణి వినియోగదారులు ప్రశాంతంగా వారివారి పనుల్లో నిమగ్నమయ్యారు.

## బావిలో పడి యువకుడి మృతి

సైదాపూర్, డిసెంబర్ 5: ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన లస్మన్నపల్లిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ జన్ను ఆరోగ్యం తెలిపిన వివరాల ప్రకారం.. లస్మన్నపల్లి గ్రామానికి చెందిన కొట్టె శ్రీకాంత్ రెడ్డి(34) సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు అతడి కోసం వెతుకగా, ఆచూకీ లభించలేదు. వెన్నంపల్లి శివారులోని నర్సరీ సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ బావి వద్దకు పనుల నిమిత్తం సదరు యజమానికి మంగళవారం వెళ్లగా, అతడికి శ్రీకాంత్‌రెడ్డి మృతదేహం కనిపించింది. వెంటనే ఆయన గ్రామస్తులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని శ్రీకాంత్‌రెడ్డి మృతదేహాన్ని బయటికి తీశారు. శ్రీకాంత్‌రెడ్డి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఒకరి ఆత్మహత్య

రాంనగర్, డిసెంబర్ 5: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన భూతం రాయలింగు (40) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కాగా, కొద్దిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం తాగి వచ్చి గొడవ చేయడంతో భార్య కొడుకు ఇంటికి వెళ్లిపోయింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న రాయలింగు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ ప్రదీప్ తెలిపారు.



నగునూర్ కేంద్రంలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

## ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి
- తీగలగుట్టపల్లి, నగునూర్‌లో కొనుగోలు కేంద్రాల పరిశీలన

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 5: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె కరీంనగర్ రూరల్ మండలంలోని తీగలగుట్టపల్లి, నగునూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, రాష్ట్రంలో తుఫాన్ ప్రభావంతో అకాల వర్షాలు కురుస్తున్నందున రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం వెంటవెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. తేమశాతం తక్కువగా వచ్చిన ధాన్యం బాయిల్డ్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీవో రామానుజాచారి, డీఎం సివిల్ సప్లయ్ రజినీకాంత్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సురేశ్, కరీంనగర్ సింగిల్ విండో సీఈవో రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సాహస శిబిరానికి ఎన్ఎస్ఎస్ వలంటీరు ఎంపిక



విద్యార్థి రుచితను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 5: జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ సాహస శిబిరానికి ఎస్సారార్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీరు రుచిత శాతవాహన విశ్వవిద్యాలయం తరపున ఎంపికైనట్లు ఎస్‌యూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఈ మనోహర్ తెలిపారు. బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రుచిత పరుగు పందెం పోటీలు, వివిధ అర్హత పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈ అవకాశాన్ని చేజిక్కించుకుంది. రుచిత ఈనెల 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని నార్కండలో జరిగే జాతీయ సాహస శిబిరంలో వలంటీర్లకు పర్వతారోహణ, రోప్ పాసింగ్, జంపింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తుందని పేర్కొన్నారు. రుచితతో పాటు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వరప్రసాద్‌ను కళాశాల ప్రధానాచార్యుడు డాక్టర్ కే రామకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ కె సురేందర్ రెడ్డి, కళాశాల స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ అధికారులు సురేశ్ కుమార్, చంద్రమౌళి, డీడీ నాయుడు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి



మాట్లాడుతున్న సీపీ అభిషేక్‌మహంతి

రాంనగర్, డిసెంబర్ 5: కమిషనరేట్ పరిధి లో శాంతిభద్రతలకు విఘా తం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల దృష్ట్యా నియమ నిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత ఏసీపీల నుంచి అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులను నిర్వహించవద్దని చెప్పారు. అనుమతుల కోసం దరఖాస్తు చేయడం ద్వారా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్‌శాఖ భద్రతాపరమైన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రోడ్లు, ప్రజలకు ఉపయోగపడే ఇతర స్థలాల్లో జనాన్ని సమీకరించవద్దన్నారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 31వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### నిషేధాజ్ఞలు కొనసాగింపు

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఒక ప్రకటనలో తెలిపారు. డీజే సౌండ్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 31వ తేదీవరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. నిషేధాజ్ఞలు ఉల్లఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 5: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ అన్నారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం తాడూరులోని జడ్పీహెచ్ఎస్, తంగళ్లపల్లిలోని మైనార్టీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమే పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల నియంత్రణ, మైనర్లపై నేరాలు, పోక్సో కేసులు తదతర చట్టాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని, చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. కార్యక్రమాల్లో లోక్‌అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, ఏజీపీ అంజయ్య, అడిషనల్ పీపీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## హమ్మయ్య కోడ్ ముగిసింది

- నగదు తరలింపులో తొలగిన ఇబ్బందులు
- ఊపిరి పీల్చుకుంటున్న ప్రజలు

కలెక్టరేట్, డిసెంబర్ 5: ఎన్నికల కోడ్‌తో ₹ 50వేలకు మించి నగదు తీసుకెళ్లాలంటేనే భయపడిన వ్యాపార, వాణిజ్య వర్గాలతో పాటు పేద, మధ్య తరగతి ప్రజలు ఈనెల 4వ తేదీ సాయంత్రం నుంచి ముగియగా ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. గత అక్టోబర్ 9న రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం వెలువరించింది. ఆ వెంటనే కోడ్ అమల్లోకి రాగా, 50రోజులకు పైగా కొనసాగింది. ఎన్నికల నిబంధనల మేరకు ₹ 50వేలకు ఒక్క రూపాయి కూడా ఎక్కువగా ఉన్నా కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందంటూ, ఎన్నికల అధికారులు ఆమొత్తాన్ని స్వాధీనం చేసుకుని ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగించారు. జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయల నగదుతో పాటు ఇతర విలువైన వస్తువులు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల సీజన్‌లోనే మంచి రోజులు ఉండడంతో, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు కూడా జిల్లావాసులు ముహుర్తాలు ఖరారు చేసుకుని, అనేక ఇబ్బందులకు గురయ్యారు. అలాగే, ఇతర సామగ్రి కొనుగోలు, రైతులు ఎరువులు, పురుగుల మందుల క్రయవిక్రయాలు, బట్టల దుకాణాల్లో చెల్లింపులు చేసే వారు కూడా పలు సమస్యలు ఎదుర్కొన్నారు. అవసరమైన కొనుగోళ్ల కోసం నగదు తీసుకెళ్తుండగా, ఎలాంటి ఆధారాల్లేవంటూ స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ప్రస్తుతం ఎన్నికలు ముగిసి, ఫలితాలు వెలువడడం, కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు ఎన్నికల సంఘం గెజిట్ ప్రకటించింది. అనంతరం రాష్ట్రంలో ఇన్నాళ్లు కొనసాగిన ఎన్నికల కోడ్ కూడా ఎత్తేస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో, దాదాపు రెండు నెలలుగా ఎదుర్కొన్న ఆంక్షలన్నీ తొలగిపోగా, తిరిగి సాధారణ పరిస్థితులు మొదలై పరిమితి లేకుండా నగదు, ఇతర వస్తువులు స్వేచ్ఛగా తీసుకెళ్లే అవకాశం కలిగింది.

### వ్యాపారులకు కోడ్ తెచ్చిన నష్టం

శాసన సభ ఎన్నికల కోడ్ తమకు నష్టాలను తెచ్చిపెట్టిందని, జిల్లాలోని వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కిరాణ, ఎరువులు, పురుగుల మందులు, బట్టల షాపులు, హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లు, బార్లు సాధారణంగా అర్ధరాత్రి వరకు కొనసాగుతుంటాయి. ఎన్నికల నిబంధనల మేరకు రాత్రి పది గంటల అనంతరం మూసివేశారు. అయితే, సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు జిల్లా కేంద్రంతో పాటు పలు పట్టణాల్లో వ్యాపారాలు కొనసాగుతుంటాయి. కోడ్ కొనసాగుతున్న నేపథ్యంలో తనిఖీ బృందాల కఠిన చర్యలతో నిర్దేశించిన గడువులోపే మూసివేయడం, పెళ్లిళ్ల సీజన్ అయినా ఎన్నికల కోడ్‌కు భయపడి సాధారణంగానే శుభకార్యాలు ముగించడంతో ఆర్థికంగా నష్టాలు వచ్చినట్లు పేర్కొంటున్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ముగియగా, కోడ్ ఎత్తేసి 24గంటలు గడవడంతో తమ సంస్థలు సజావుగా నడిచేందుకు మార్గం సుగమమైందని వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు.

## పోస్టల్ ఏజెంట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

- సూపరింటెండెంట్ శివాజీ

కరీంనగర్, డిసెంబర్ 5: భారతీయ తపాలా శాఖ కరీంనగర్ డివిజన్ పరిధిలో కమీషన్ బేసిస్‌తో తపాలా జీవిత బీమా ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ డివిజన్ తపాలా శాఖ సూపరింటెండెంట్ శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 50 ఏళ్ల మధ్య ఉన్న కరీంనగర్ డివిజన్‌కు చెందిన నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు పూర్తి చేసిన దరఖాస్తులను కరీంనగర్ డివిజన్ ఆఫీస్‌లో ఈ నెల 18వ తేదీలోగా అందజేయాలని పేర్కొన్నారు. ఎంపిక చేసిన అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఏజెంట్లుగా నియమితులైన వారు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.5 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు సమీపంలోని పోస్టాఫీస్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.